సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



ఓసీ-2లో కార్మికుడి దుర్మరణం
మణుగూరు ఓసీలో డంపర్ పల్టీ కొట్టి ఆపరేటర్ మూల్‌చంద్ దుర్మరణం చెందాడు. మృతుడి స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌నగర్. 8లో



సమ్మెబాటలో కాంట్రాక్ట్ టీచర్లు
గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు నేటి నుంచి సమ్మె చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
27° / 20°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సుందరం.. సుమనోహరం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన


అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమారశర్మ తదితరులు పాల్గొన్నారు.

సెమినార్‌లో పాల్గొనే వారు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఉపాధ్యాయులకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొనే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్ ప్రధానాంశం సైన్స్ ఇన్ ఆవర్ వరల్డ్‌పై ఉంటుందని, సైన్స్ ఉపాధ్యాయులు, టీచర్ ఎడ్యుకేటర్లు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. ఉప అంశాలుగా సైన్స్ బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎకోలాజికల్ బ్యాలెన్స్, ఫుడ్ ఎడ్యుకేషన్ – రోల్ ఆఫ్ టీచర్స్, సైన్స్ ఎడ్యుకేషన్ స్థాయి పెంపునకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలు, రసాయనిక శాస్త్రం –అభ్యాసనపై సెమినార్ పత్రాలు రూపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం వద్దు


చర్లలో నర్సరీని పరిశీలిస్తున్న భీమానాయక్

చర్ల: అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించొద్దని సీసీఎఫ్ డి.భీమానాయక్ అన్నారు. గురువారం ఆయన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించారు. దుమ్ముగూడెం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని, గోవిందాపురం – బక్కచింతపాడు అటవీ ప్రాంతం మీదుగా రహదారి నిర్మాణానికి సంబంధించి పరిశీలించారు. ఆ తర్వాత చర్ల అటవీశాఖ కార్యాలయంలో నర్సరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే వేసవిలో అడవులు అగ్నికి ఆహుతి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పట్టాలిచ్చిన పోడు భూములు మినహా మరెక్కడా పోడు కొట్టకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా పోడు కొట్టినట్టు సమాచారం వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్య తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎఫ్‌డీఓ సుజాత, రేంజ్ ఆఫీసర్లు ద్వాలియా, కమల తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల పర్యవేక్షణలోనే ప్రసవాలు జరగాలి

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, స్టాఫ్‌నర్సుల పర్యవేక్షణలో ప్రసవాలు జరరగాలని డీఎంహెచ్ఓ ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. ఐడీఓసీలో గురువారం వారసత్వ, జన్యుపరమైన రుగ్మతలపై వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు నెలల్లోపు పిల్లల్లో వచ్చే జన్యుపరమైన రుగ్మతలకు కారణాలు తెలుసుకునేందుకు ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, డాక్టర్లు రాధామోహన్, బాలాజీ, చైతన్య పాల్గొన్నారు.

బీటీపీఎస్ కర్మాగారం(ఇన్‌సెట్) బొగ్గు సరఫరా చేస్తున్న లారీలు




బీటీపీఎస్‌లో బిల్లుల లొల్లి !

పవర్‌స్టేషన్‌కు నిత్యం వేల టన్నుల్లో బొగ్గు రవాణా
- వందలాది లారీల్లో ప్లాంట్‌కు సరఫరా
- రెండు నెలలుగా లారీ యజమానులకు అందని బిల్లులు
- కిస్తీలు, డ్రైవర్ల వేతనాల చెల్లింపులకు ఇక్కట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు రవాణా చేసే లారీలకు చెల్లించాల్సిన బిల్లులు రెండు నెలలుగా అందడం లేదు. దీంతో నెలవారీ కిస్తీలు, డ్రైవర్ల వేతనాల చెల్లింపులకు ఇబ్బంది కలుగుతోందని లారీ/టిప్పర్ యజమానులు ఆందోళన చెందుతున్నారు.

రోజుకు 18 వేల టన్నుల బొగ్గు..
బీటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1,080 మెగావాట్లు కాగా ఈ ప్లాంట్‌కు నిత్యం 18 వేల టన్నుల బొగ్గును సింగరేణి సరఫరా చేయాల్సి ఉంది. బొగ్గు సరఫరాకు గ్లోబల్ టెండర్లు ఆహ్వానించి, నలుగురు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. రోజుకు 18వేల టన్నులకు ఇటీవలి వరకు 14 వేల టన్నులకు తగ్గకుండా బొగ్గు సరఫరా చేసేవారు. అయితే జూలై 4న సంభవించిన పిడుగుపాటుతో ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. దీంతో నిత్యం పది వేల టన్నుల బొగ్గు ఈ ప్లాంట్‌కు వస్తోంది. సుమారు 110 లారీలు/టిప్పర్లు బొగ్గు రవాణా చేస్తున్నాయి. కిలోమీటర్‌కు రూ.5.60 నుంచి రూ.5.75 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు. ప్యూయల్ చార్జీలను కాంట్రాక్టర్లే చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ నెల 12 నుంచి 20వ తేదీలోగా రవాణా చార్జీలు చెల్లించేవారు. కానీ నవంబర్‌లో బిల్లులు చెల్లించకపోగా డిసెంబర్ లోనూ 20వ తేదీ వచ్చినా ఇంకా అందలేదు. దీంతో లారీలు, టిప్పర్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

ఈఎంఐలు చెల్లించేదెలా..?
బీటీపీఎస్ నిర్మాణం జరగగానే బొగ్గు రవాణాను నమ్ముకుని అనేక మంది నిరుద్యోగులు, సింగరేణి కార్మికుల పిల్లలు, గిరిజన యువకులు బ్యాంకు రుణాలు తీసుకుని లారీలు, టిప్పర్లు కొనుగోలు చేశారు. ఒక్కో లారీకి కనీసం నెలకు రూ.60,000 ఈఎంఐ (కిస్తీ) చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు ప్రతీ టిప్పర్‌కు ఇద్దరు డ్రైవర్ల జీతభత్యాలకు మరో రూ.60,000 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా నెలకు రూ.1.20లక్షలు చెల్లించాల్సి వస్తోందని, బిల్లుల జాప్యంతో తమకు ఇబ్బంది కలుగుతోందని యజమానులు అంటున్నారు. లారీలను నమ్ముకుని ఒక్క మణుగూరులోనే వెయ్యికి పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

చెల్లింపుల్లోనూ అసమానతలు..
కోల్ ట్రాన్స్‌పోర్ట్ బిల్లుల జారీలో ఆలస్యం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో చెల్లింపుల్లో ఉన్న వ్యత్యాసాల సమస్య వెలుగు చూసింది. బీటీపీఎస్‌కు బొగ్గు సరఫరా చేస్తున్న 14 టైర్ల టిప్పర్ల యజమానుల ఆధ్వర్యంలో గతంలో ఆసోసియేషన్ ఏర్పడింది. ఈ అసోసియేషన్ పరిధిలో ఉన్న 70 టిప్పర్లు/లారీలకు ఒక కిలోమీటర్‌కు రూ.5.75 వంతున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు. ఈ అసోసియేషన్‌కు బయట మరో 40 లారీలు కూడా బొగ్గు సరఫరా చేస్తున్నాయి. అయితే ఈ లారీలకు కి.మీ.కు రూ.5.60 చొప్పునే చెల్లిస్తున్నారు. అంతేకాకుండా అసోసియేషన్‌లో సభ్యత్వం ఉన్న, సభ్యత్వం లేని టిప్పర్ల మధ్య టన్ను బొగ్గు రవాణాకు చెల్లించే చార్జీల్లో కనీసం రూ.3 వత్యాసం ఉంది. ఫలితంగా నెలవారీ బిల్లులో రూ. 15 వేల నుంచి రూ.20 వేల వరకు అసోసియేషన్ బయట ఉన్న టిప్పర్ యజమానులు నష్టపోతున్నారు. సమాన పనికి సమానంగా బిల్లులు ఇప్పించాలంటూ టిప్పర్ అసోసియేషన్‌కు ఆవల ఉన్న యజమానులు కోరుతున్నారు. ఈ మేరకు ఈ అంశంపై ఇప్పటికే నాలుగైదు సార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినా సమస్య కొలిక్కి రాలేదు.

రెండు, మూడు రోజుల్లో రావొచ్చు
బొగ్గు రవాణాకు సంబంధించి రెండు నెలల బిల్లులు విద్యుత్ సౌధలో పెండింగ్‌లో ఉన్నాయి. మరో రెండు మూడు రోజుల్లో మంజూరు కావొచ్చు. ప్రస్తుతం ప్లాంట్‌లో 2.80 లక్షల టన్నుల బొగ్గు నిలవలు ఉన్నాయి. రవాణాలో ఇబ్బందులు ఎదురైనా ప్లాంట్‌కు ఇప్పటికిప్పుడు వచ్చే సమస్య ఏమీ లేదు.
– బిచ్చన్న, బీటీపీఎస్ సీఈ

రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి

గురుకులాల స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ పాటిల్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన అధికారులు


కబడ్డీ పోటీలో తలపడుతున్న జట్లు

పాల్వంచరూరల్: గురుకుల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి అధిక పతకాలు సాధించాలని, జాతీయ స్థాయిలోనూ రాణించి రాష్ట్రానికి పేరు తేవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకాంక్షించారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌ను గురుకులాల జాయింట్ సెక్రటరీ బి.సక్రునాయక్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పరస్పరం గౌరవించుకుంటూ క్రమశిక్షణతో కూడిన క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడంలో ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని, క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. గురుకులాల జాయింట్ సెక్రటరీ సక్రునాయక్ మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదువుతో పాటు క్రీడలకూ సమ ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడా నిపుణులతో విద్యార్థులకు శిక్షణ ఇప్పించి, వారిలోని నైపుణ్యాన్ని వెలికితీస్తామని చెప్పారు. ప్రతీ ఏడాది పాఠశాల స్థాయితో పాటు జోనల్, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తూ విజేతలను సొసైటీ లీగ్ పోటీలకు పంపిస్తామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ బి.నారాయణ, మల్టీ జోనల్ అధికారి కాంపాటి అలివేలు, జిల్లా జోనల్ అధికారులు స్వరూప, ప్రత్యూష, ప్రిన్సిపాల్ పాపారావు, సీనియర్ ప్రిన్సిపాల్ కన్నెకంటి వెంకటేశ్వర్లు, ఖమ్మం డీసీఓ రాజ్యలక్ష్మి, రాష్ట్ర స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ ఇన్‌చార్జ్ సట్ల శంకర్‌తో పాటు రాజు, నాగేశ్వరరావు, ఎం.స్వరూప, విజయదుర్గ, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

1,358 మంది విద్యార్థులు హాజరు..
మూడు రోజులపాటు జరగనున్న ఈ క్రీడా పోటీలకు రాష్ట్రంలోని కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి, యాదాద్రి, చార్మినార్, జోగుళాంబ జోన్లకు చెందిన 1,358 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, చదరంగం, క్యారమ్స్‌తో పాటు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, 400 మీటర్ల రిలే పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నారు. మొదట జోన్ల వారీగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రోడ్డు భద్రతపై జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా, వైకల్యం బారిన పడకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాదాల నివారణపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ రహదారి పక్కనున్న గ్రామాల్లో పోలీస్ కళాబృందాలతో ప్రచారం చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రమాదాల బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు మైకులు, కూలింగ్ హెల్మెట్ల కోసం ప్రతిపాదనలు అందజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఎన్‌హెచ్ ఈఈలు వెంకటేశ్వర్లు, కాశయ్య, యుగంధర్, డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, డీఈఓ వెంకటేశ్వరాచారి, రవాణాధికారి సదానందం, డీసీహెచ్ఎస్ రవిబాబు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై చర్యలు తప్పవు

ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంఅర్బన్: సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులతో పాటు గంజాయి అక్రమ రవాణా, మట్కా, బెట్టింగ్‌లు నిర్వహించే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీసి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని అన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. గత నెలలో వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఇల్లెందు, మణుగూరు, డీసీఆర్బీ డీఎస్పీలు చంద్రభాను, రవీందర్ రెడ్డి, మల్లయ్య స్వామి, సీఐలు శ్రీనివాస్,'రమాకాంత్, నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోటేశ్వరరావు కుటుంబసభ్యులకు చెక్కు అందిస్తున్న ఎస్పీ

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు
జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.కోటేశ్వరరావు ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించగా ఆయన కుటుంబసభ్యులకు ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం రూ.8,58,320 చెక్కు అందజేశారు. భద్రతా విభాగం నుంచి ఎక్స్‌గ్రేషియా రూపంలో ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. కోటేశ్వరరావు కుటుంబ ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యానారాయణ, ఆర్ఐలు లాల్‌బాబు, కృష్ణారావు, జిల్లా కార్యాలయ ఏఓ అజ్మీరా మంజ్యా నాయక్, సూపరింటెండెంట్ సత్యవతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు మున్సిపాలిటీకి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కమిషనర్ శ్రీకాంత్

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీకి జాతీయ స్థాయి అవార్డు దక్కింది. ఈ మేరకు కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ గురువారం ఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ సీఎస్ఈ సునితా నార్నే చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 లో భాగంగా శానిటేషన్‌లో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచటంతో పాటు పౌరుల భాగస్వామ్యం పెంచడంలో విశేష కృషి చేసినందుకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేంజ్ మేకర్ కాంక్లేవ్–2024 అప్రియేషన్ సర్టిఫికెట్ అందజేశారు. రాష్ట్రం నుంచి 20 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు అవకాశం దక్కగా అందులో ఇల్లెందు ఉండడం విశేషం. అంతేకాక కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బుక్‌లెట్‌లోనూ ఇల్లెందుకు చోటు దక్కింది. అవార్డుకు ఎంపికవడం పట్ల ఎంపీ బలరామ్ నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎరుపెక్కిన ఇల్లెందు

- నేడు, రేపు సీపీఎం జిల్లా మహాసభలు
- ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కార్యదర్శి వెల్లడి


ఇల్లెందులో ఏర్పాటుచేసిన తోరణాలు

ఇల్లెందు/సింగరేణి(కొత్తగూడెం): సీపీఎం జిల్లా మహాసభలకు ఇల్లెందు ముస్తాబైంది. బ్యానర్లు, తోరణాలు, ఫ్లెక్సీలతో పట్టణం ఎరుపుమయంగా మారింది. ఇల్లెందులోని 24 ఏరియా కమ్యూనిటీ హాల్‌లో శుక్ర, శనివారాల్లో మహాసభలు జరుగనున్నాయి. శుక్రవారం ఉదయం భారీ ప్రదర్శన నిర్వహిస్తామని, సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతారని పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. గురువారం ఆయన కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు ఎస్.వీరయ్య, బి.వెంకట్, మిడియం బాబూరావు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. జిల్లాలో గత మూడేళ్లలో ప్రజా సమస్యలపై నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను సమీక్షించుకుని భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని భూములకు నీరందించేలా మంత్రులు ఆలోచించడం లేదని, దీంతో జిల్లాకు అన్యాయం జరుగుతుందని అన్నారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలతో సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో నానాటికీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతోందని ఆరోపించారు. పార్టీ నాయకులు పి.సోమయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, లిక్కి బాలరాజు, కె.బ్రహ్మాచారి, అన్నవరపు సత్యనారాయణ, ఆలేటి కిరణ్, వజ్జా సురేష్ పాల్గొన్నారు.

మేళవింపుతోనే మేలు..

- ఆధ్యాత్మిక, ఆదివాసీ సంస్కృతుల కలబోతకు కసరత్తు
- మ్యూజియం ప్రాంగణంలో 'గిరిజన పల్లె'
- ఆదివాసీ వంటకాలతో పర్యాటకులకు స్వాగతం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవ


ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న గిరిజన మ్యూజియం


గిరిజన పల్లె వాతావరణంతో సిద్ధమవుతున్న వెదురు నిర్మాణాలు

భద్రాచలం: శ్రీ సీతారాముల దర్శనానికి వచ్చే వివిధ ప్రాంతాల భక్తులకు స్థానిక గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌తో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు చకచకా పనులు జరుగుతున్నాయి. అయితే భద్రాచలంలో జరిగే అభివృద్ధిలో ఆధ్యాత్మిక, గిరిజన సంస్కృతిని మేళవించాలని కోరుతున్నారు.

ప్రచారం.. ప్రయాణం
భద్రాచలం చుట్టుపక్కల అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నా సరైన ప్రచారం, రవాణా సౌకర్యాలు లేక అవి ఆదరణ కోల్పోతున్నాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న గిరిజన పల్లె కూడా వాటి సరసన చేరకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ఉదాహరణకు సీతారాముల దర్శనం తర్వాత పాపికొండలు టూర్‌కి వెళ్లాలనుకునే భక్తులకు ఆలయం వెలుపల గిరిజన సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు ఉన్నాయి. ఇక్కడ పాపికొండలు టూర్‌కు బోట్ టికెట్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అవసరమైతే ఈ సొసైటీ ద్వారానే అదనపు చార్జీలతో రవాణా సౌకర్యం కూడా కల్పిస్తారు. అలాగే కొత్తగా నిర్మిస్తున్న గిరిజన పల్లెకు ఆలయ పరిసర ప్రాంగణంలో ప్రచారం కల్పించాలి. గిరిజన పల్లెకు వెళ్లేందుకు వాహనాలు (ప్రీ పెయిడ్ ట్యాక్సీ) అందుబాటులో ఉంచాలి. ఒకసారి భక్తులు, పర్యాటకులు గిరిజన పల్లెకు రావడం మొదలై, సానుకూల జన వాక్కు బలపడితే ఆ తర్వాత ప్రత్యేక ఏర్పాట్లు లేకపోయినా పర్యాటకుల రాకకు ఢోకా ఉండదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక దృష్టి పెట్టిన కలెక్టర్..
పర్యాటక పరంగా భద్రాచలం అభివృద్ధితో పాటు ఇక్కడి గిరిజన సంస్కృతికి ప్రాచుర్యం కల్పించడంపై కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో వివిధ యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఇక్కడికి ఆహ్వానించారు. పంచతంత్ర స్టూడియో, రైస్ వాటర్ ప్రాజెక్టు ప్రతినిధులచే డాక్యుమెంటరీ చిత్రీకరించారు. మరోవైపు బలవర్ధకమైన ఆదివాసీ వంటకాలను పర్యాటకులకు, భక్తులకు పరిచయం చేసేలా ప్రచారం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం పర్యటనకు వచ్చే వీఐపీలందరికీ ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మహిళలు తయారు చేయించిన వంటకాలను రుచి చూపిస్తున్నారు.

థీమాటిక్ క్యాంపెయిన్
భద్రాచలం పట్టణం ఓ వైపు ఆధ్యాత్మిక కేంద్రంగా ఉంటూనే మరోవైపు ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఉన్న ఆదివాసీ గిరిజన సంస్కృతులకు కేంద్రంగా ఉంది. దీనికి తగ్గట్టుగా ప్రస్తుతం భద్రాచలంలో జరుగుతున్న పనులకు రాజస్థాన్‌లోని జైపూర్ తరహాలో థీమాటిక్ క్యాంపెయిన్ జోడిస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గోదావరి వంతెన తర్వాత చెక్‌పోస్టు నుంచి అంబేద్కర్ సెంటర్, రాజీవ్ సెంటర్, తాతగుడి సెంటర్, బ్రాహ్మణబజార్‌లతో పాటు ఫైర్ స్టేషన్ నుంచి సబ్ కలెక్టర్ ఆఫీస్ మీదుగా ఆలయం వరకు ఉన్న ప్రాంగణాల్లో రామాయణం థీమ్‌తో పెయింటింగ్, కూడళ్లలో రామాయణ ఇతివృత్తం తెలిపే ప్రతిమలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఇక జూనియర్ కాలేజీ రోడ్డు నుంచి ఐటీడీఏ ప్రాంగణం, కూనవరం, చర్ల రోడ్లలో గిరిజన సంస్కృతి కళ్లకు కనిపించేలా సరికొత్త సొబగులు అద్దాలంటున్నారు. దీంతో పాటు ఐటీడీఏ మ్యూజియం ప్రాంగణంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆదివాసీ వస్తువులు, పరికరాలు, జీసీసీ ద్వారా సేకరించిన తేనే, స్వయం ఉపాధి ద్వారా తయారు చేస్తున్న షాంపులు, సబ్బులు, పౌష్టికాహార పదార్థాలను విక్రయించాలని అంటున్నారు. తద్వారా గిరిజన ఉత్పత్తులకు ప్రచారం పెరగటంతో పాటు వారు ఆర్థికాభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

మ్యూజియంలో 'గిరిజన పల్లె'..
ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న గిరిజన మ్యూజియంలో 'గిరిజన పల్లె'ను తీర్చిదిద్దుతున్నారు. బిహార్ నుంచి వచ్చిన కూలీలు వెదురుతో గుడిసె, మట్టి ఇల్లు, మంచె వంటి గిరిజన ఇళ్ల నమూనా ఉండేలా నిర్మిస్తున్నారు. పర్యాటకులు వీటిలోనే కూర్చుని గిరిజన పల్లె అందాలను వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఆదివాసీ వంటకాలను పర్యాటకులకు రుచి చూపేందుకు ప్రత్యేకంగా ఇదే ప్రాంగణంలో కుటీర నిర్మాణానికి బడ్జెట్ కేటాయించారు. ఈ పనులన్నీ జనవరి 9, 10 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ముక్కోటి నాటికి పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

రవాణా శాఖ మంత్రికి ఎమ్మెల్యే వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే కోరం కనకయ్య వినతి పత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లో అసెంబ్లీ వద్ద మంత్రిని కలిసి ఇల్లెందు డిపోలో కొత్త బస్‌లు, పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని, సరిపడా సిబ్బందిని కేటాయించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి డిపోను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మూల మధుకర్‌రెడ్డి, మడుగు సాంబమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌నాయక్, మాలోతు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల మన్ననలు పొందాలి

విధుల్లో చేరిన ఉద్యోగులతో ఐటీడీఏ పీఓ



ఐటీడీఏ పీఓ, ఏపీఓతో నూతన ఉద్యోగులు

భద్రాచలం: సమస్యల పరిష్కారం కోసం వచ్చే గిరిజనులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి ఇబ్బందులను పరిష్కరించడం ద్వారా మన్ననలు పొందాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఇటీవల గ్రూపు-4లో ప్రతిభ కనబరిచి జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికైన పలువురు ఐటీడీఏలో గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారిని పీఓ అభినందించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి పడిన కష్టాన్ని విధినిర్వహణలోనూ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏఓ సున్నం రాంబాబు, ఉద్యోగులు బండారు సాయిచంద్, ధరావత్ పవన్‌కళ్యాణ్, శీలం భావన, టి.సూపర్ సజీవన్, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: అనంతారం హెల్త్ సబ్ సెంటర్‌లో మూడో రోజు బుధవారం కూడా కిడ్నీ బాధితులు, అనుమానితుల రక్త నమూనాలను వైద్యసిబ్బంది సేకరించారు. మొదటి రోజు 50 మంది, రెండో రోజు 18, మూడో రోజు 12 మంది.. మొత్తం 80 మంది రక్తనమూనాలు సేకరించినట్లు సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ తెలిపారు. హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీ రాధిక, ఏఎన్ఎంలు సావిత్రి, వెంకటముత్యం, ఆశా కార్యకర్తలు పూనెం ఝాన్సీ, వెంకటలక్ష్మి, సుమిత్ర, విజయ, లీలావతి, సుశీల పాల్గొన్నారు.

వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

పాల్వంచ: సీపీఐ వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా కోరారు. గురువారం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నిర్వహించిన పట్టణ, మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించాలని సూచించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు సరికాదని, తక్షణం పదవికి రాజీనామా చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, పద్మజ, శ్రీనివాసరావు, అస్లాం, నరహరి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులకు తమ సమస్యలను నేరుగా తెలిపేందుకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు సలహాలు, ఫిర్యాదుల కోసం 99592 25959 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఓసీ-2లో కార్మికుడి దుర్మరణం

డంపర్ పల్టీ కొట్టడంతో గనిలో ప్రమాదం

- సింగరేణి మణుగూరు ఏరియాలో ఘటన
- మృతుడి స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌నగర్



ఆస్పత్రిలో మృతదేహాన్ని సందర్శిస్తున్న నాయకులు, (ఇన్‌సెట్) మూల్ చంద్ (ఫైల్)

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2 గనిలో డంపర్ పల్టీకొట్టి కార్మికుడు దుర్మరణం చెందిన సంఘటన గురువారం జరిగింది. తోటి కార్మికుల కథనం ప్రకారం.. ఓసీ-2లో డంపర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మూల్ చంద్(60) నంబరు 10795 కలిగిన 100 టన్ డంపర్‌ను ఆపరేట్ చేస్తున్నాడు. అందులో భాగంగా భగీరథ డంప్‌యార్డ్ వద్దకు ఓబీ మట్టి తీసుకెళ్లి అన్‌లోడ్ చేస్తుండగా.. జారిపోయి ఒక్కసారిగా పల్టీకొట్టి సుమారు 60 మీటర్ల దిగువన ఉన్న డంప్‌యార్డ్ వెనుకవైపు పడింది. ఈ ఘటనలో డంపర్ అద్దాలు పగిలిపోయి ఆపరేటర్ ముందు భాగం నుంచి బయటికి రాగా తలకు బలమైన రాయి తగిలి తీవ్ర గాయమైంది. గుర్తించిన అధికారులు కార్మికుడిని అంబులెన్స్ ద్వారా ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఏడాదిన్నర క్రితం కొత్తగూడెం నుంచి డిప్యూటేషన్‌పై మణుగూరు వచ్చిన మృతుడు రోజూ కొత్తగూడెం నుంచి మోటార్ సైకిల్‌పై వచ్చి వెళ్తు ఉన్నాడు. మరో ఏడు నెలల్లో రిటైర్ అయ్యే సదరు కార్మికుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు, భార్య ఉన్నారు. స్వస్థలం మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌నగర్ కాగా, ఇతను మాజీ సైనికుడు. ఈ నెల 9 నుంచి సింగరేణిలో రక్షణ పక్షోత్సవాలు జరుగుతుండగా, ఓసీ-2లో కూడా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ తరుణంలోనే ప్రమాదం జరగడం గమనార్హం.

నివాళులర్పించిన కార్మిక సంఘాలు...

సంఘటన విషయం తెలుసుకున్న కార్మిక సంఘాల నాయకులు ఆస్పత్రిలో వివరాలు సేకరించి మృతుడికి నివాళులర్పించారు. ఏఐటీయూసీ బ్రాంచి నాయకులు రాంగోపాల్, రామనర్సయ్య, మేకల ఈశ్వర్, సురేందర్, శనిగరపు కుమారస్వామి, నాగరాజు, ఐఎన్‌టీయూసీ త్యాగరాజన్, అల్బర్ట్, కృష్ణంరాజు, గట్టయ్య, టీబీజీకేఎస్ నాగెల్లి వెంకట్ తదితరులు మృతుడికి నివాళులర్పించినవారిలో ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి కంపెనీ నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే అందేలా కృషి చేస్తామని కుటుంబానికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విషయం తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు.



ప్రమాదంలో దెబ్బతిన్న డంపర్

యాజమాన్యమే బాధ్యత వహించాలి: సీఐటీయూ

ఈపీ ఆపరేటర్ మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. డంపర్ అన్‌లోడ్ ప్రదేశంలో బర్మ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా చేయలేదని, రివర్స్ వెళ్లేటప్పుడు టైర్ తగిలి డంపర్ ఆగిపోతోందన్నారు. స్పాటర్ ఉండి పాయింట్ చెప్పాలని, అది కూడా లేదని అన్నారు. ట్రిప్పులు వేయకపోతే లెటర్లు, పనిఒత్తిడి వంటి అంశాలతో కార్మికుల రక్షణ మరిచి ఉత్పత్తిపైనే దృష్టి సారించడం వల్లే ప్రమాదం సంభవించిందన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రాణాలొదులుతున్న గని కార్మికులు

- రక్షణ పక్షోత్సవాల సమయంలోనే ప్రమాదం
- అధికారుల తప్పిదమే కారణమని కార్మిక నేతల ఆరోపణలు



మణుగూరు ఓసీ-2 నుంచి మూల్ చంద్‌ను స్ట్రెచ్చర్‌పై తరలిస్తున్న తోటి కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గనులు మృత్యు కుహరాలని గురువారం మణుగూరులో జరిగిన ప్రమాదంతో మరోమారు రుజువైంది. ఒక వైపు సంస్థలో రక్షణ పక్షోత్సవాలు జరుగుతుండగానే మరోవైపు ప్రమాదం జరిగింది. అధికారుల తప్పిదం వల్లే కార్మికుడు మృతి చెందాడని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. సింగరేణిలో గత ఏడేళ్లలో 56 మంది గని ప్రమాదాల్లో మృతిచెందారు. 801 మందికి తీవ్రగాయాలు, 1,043 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఏడాది ఏడుగురు చనిపోయారు.

రక్షణ పక్షోత్సవాలు జరుగుతుండగానే..

ప్రమాదాల నివారణకు యాజమాన్య కమిటీ ఏర్పాటు చేసి సింగరేణి వ్యాప్తంగా కొద్ది రోజులుగా రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. సంస్థవ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో కమిటీల ద్వారా పర్యవేక్షణ చేయిస్తూ రక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెబుతోంది. అయితే ఆచరణలో రక్షణ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని కార్మిక నేతలు పేర్కొంటున్నారు. కార్మికులను పూర్తిస్థాయిలో సమీకరించి అవగాహన కల్పించడం లేదని ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు తమ పంతం నెగ్గించుకునేందుకు ఒత్తిడి చేసి కార్మికులతో విధులు నిర్వర్తింపజేస్తున్నారని చెబుతున్నారు. ప్రతి ఉద్యోగి సేఫ్ ఆపరేటింగ్ ప్రాసెస్ (ఎస్ఓపీ), ఎస్ఎంపీ (సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్)లను పాటించాల్సి ఉంది. ఈ రెండు ప్లాన్‌లను అమలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదనే భావన వ్యక్తమవుతోంది.

మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ

ఎక్కడ పుట్టి పెరిగి మణుగూరు ఏరియాలోని ఓసీలో విధులు నిర్వర్తిస్తున్న మాజీ సైనికుడు మూల్ చంద్(60) ప్రమాదంలో ప్రాణం విడిచారు. భూపాల్‌లో జన్మించిన మూల్‌చంద్ సైన్యంలో డ్రైవర్‌గా పనిచేశాక ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటాలో సింగరేణిలో 24ఏళ్ల క్రితం డంపర్ ఆపరేటర్‌గా విధుల్లో చేరాడు. కొత్తగూడెం ఏరియా జీకేఓసీలో పనిచేస్తూ గౌతంపూర్‌లో నివాసముంటుండగా ఇక్కడ బొగ్గు నిక్షేపాలు అయిపోవటంతో యాజమాన్యం మణుగూరు ఏరియాకు డిప్యూటేషన్‌పై పంపింది. దీంతో మూల్‌చంద్‌ను రోజు కొత్తగూడెం నుంచి మణుగూరుకు వెళ్లివస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఓసీలోని క్వారీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందగా కుటుంబంలో విషాదం నెలకొంది. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కాగా, మూల్‌చంద్‌కు ఆరు నెలల సర్వీసే ఉండగా రిటైర్‌మెంట్ అనంతరం స్వగ్రామానికి వెల్దామని కుటుంబీకులతో చెప్పిన ఆయన ఇప్పుడు మృత్యువాత పడ్డాడు. కాగా, మృతుడి కుటుంబాన్ని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఫోన్‌లో పరామర్శించడమే కాక సంస్థ రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందించాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డిని కోరారు. అలాగే, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్, నాయకులు ఎండీ సత్తార్ తదితరులు మూల్‌చంద్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

గడిచిన ఏడేళ్లలో సింగరేణిలో జరిగిన ప్రమాదాల వివరాలు

సంవత్సరం	మృతులు	తీవ్ర గాయాలు	స్వల్ప గాయాలు
2018	7	191	347
2019	8	138	217
2020	12	102	108
2021	13	122	107
2022	05	96	122
2023	05	68	70
2024	07	84	72

ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న కేఏ పాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ 12 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఉద్యోగుల బాధలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జనవరి 2 నాటికి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ అధికారంలోకి రాగానే ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్నారు. ఉద్యోగుల సమ్మెకు వివిధ సంఘాల నాయకులు రాములు, బాలకృష్ణ, రాథోడ్ మద్దతు తెలిపారు.

గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తాం

మణుగూరు టౌన్ : వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ బలపర్చిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ అధినేత కేఏ పాల్ అన్నారు. బస్సు యాత్రలో భాగంగా గురువారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరుకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. ఆ హయాంలో గ్రామ సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. గెలిచిన 100 రోజుల్లోనే గ్రామాల్లో ఆస్పత్రులు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సమ్మె బాటలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు



కోయగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు సమ్మె నోటీసు ఇస్తున్న సీఆర్‌టీలు

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయు(సీఆర్‌టీ)లు 48 గంటలపాటు నిరవధిక సమ్మెకు దిగనున్నారు. శుక్ర, శనివారాల్లో సమ్మె చేయనున్నట్లు ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల నాయకులు భద్రాచలం ఐటీడీఏ డీడీ మణెమ్మతోపాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోటీసులు అందజేశారు. సమ్మెతోనైనా ప్రభుత్వం స్పందించకపోతే వారం తర్వాత ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,100మంది సీఆర్‌టీలు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలోని 52 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 210మంది, ఖమ్మంజిల్లాలోని 11పాఠశాలల్లో 62 మంది సీఆర్‌టీలు ఉన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా 20ఏళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్న తమ సర్వీసు క్రమబద్ధీకరించాలని కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెబాట పట్టినట్లు కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ తెలిపారు. కాగా పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఉపాధ్యాయుల సమ్మెతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం ఎదురుకానుంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక





క్రీడాకారులు సాయి కుమార్, బాలు

జూలూరుపాడు: ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు జూలూరుపాడు మండలం సురారం గ్రామానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. సురారానికి చెందిన కొడెం సాయి కుమార్, బచ్చల బాలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా వీరిని తహసీల్దార్ కె. స్వాతి బిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్ రెడ్డి, ఎంఈఓ బి జుంకీలాల్ అభినందించారు. కాగా కొత్తగూడెంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జూలూరుపాడు మండల జట్టు ద్వితీయ స్థానం సాధించింది.

రెండు బైక్‌లు ఢీ

ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని వీరభద్రాపురం గ్రామ సమీపంలో గురువారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీలు నర్సింగ్, లోటోలు బైక్‌పై సురారం నుంచి పంట పొలాలకు వెళుతున్నారు. అదే సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన వరికోత మిషన్ డ్రైవర్ బబ్లూ జూలూరుపాడు నుంచి సురారం గ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో వీరభద్రాపురం సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో లోటో, బబ్లూకు తీవ్ర గాయాలు కాగా, నర్సింగ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ట్రాక్టర్ స్వాధీనం

మణుగూరు టౌన్: పాల్వంచ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అనిల్ గత శుక్రవారం గుర్తు తెలియని వాహనం తోగ్గూడెం శివారు ప్రాంతంలో ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో విచారణ చేపట్టి ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. వారం రోజులపాటు ఎస్ఐలు మేడ ప్రసాద్, రంజిత్, కానిస్టేబుల్ రామారావు బృందం అశ్వాపురం, మణుగూరు మండలాల సీసీ ఫుటేజీలను పరిశీలించిందని చెప్పారు. ట్రాక్టర్ అశ్వాపురానికి చెందిన రమేష్‌దిగా గుర్తించి సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. కాగా వాహనాన్ని గుర్తించి సీజ్ చేసిన బృందాన్ని డీఎస్పీ రవీందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి రివార్డు అందించారని పేర్కొన్నారు.

మిర్చి కొనుగోళ్లపై సన్నాహక సమావేశం



ఖమ్మంవ్యవసాయం: మిర్చి సీజన్ సమీపిస్తున్న నేపథ్యాన అధికారులు ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ ఆధ్వర్యాన అధికారులు సమీక్షించారు. మిర్చి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యాన కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా తీసుకునే చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు జిల్లాతో పాటు పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచే కాక ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు కూడా మిర్చి తీసుకొస్తారు. ఈనేపథ్యాన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై శ్రీనివాస్ సూచనలు చేశారు. ఈసందర్భంగా మిర్చి శాఖ, దడవాయిలు, హమాలీలు, దిగుమతి శాఖ ప్రతినిధులు పంట కొనుగోళ్లతో ఉత్పన్నమయ్యే సమస్యలను వివరించారు. దిగుమతి శాఖకు చెందిన ప్రతినిధులు కాంటాల సమయాన సాంకేతిక సమస్యలు వస్తున్నాయని తెలిపారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మిర్చి కొనుగోళ్లలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో సరుకు క్రమపద్ధతిలో దించేలా పర్యవేక్షించాలని లైసెన్స్ లేని వ్యాపారులను అనుమతించొద్దని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఖమ్మం మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రేడ్-2 కార్యదర్శి సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాష్ ట్యాంకర్ బోల్తా



డ్రైవర్‌ను కాపాడిన అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్-జూలూరుపాడు గ్రామాల మధ్య గురువారం తెల్లవారుజామున యాష్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం భోజ్యాతండాకు చెందిన డ్రైవర్ సౌదాసోత్ శివ మణుగూరు బీటీపీఎస్‌లో యాష్ ట్యాంకర్ లోడ్ చేసుకుని హుజూర్‌నగర్ జాన్‌పాడ్ దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడు-వినోభానగర్‌ల మధ్య సీతారామ ప్రాజెక్టు కెనాల్ కార్యాలయ సమీపంలో ఎదురుగా వెళుతున్న కారును తప్పించబోయి యాష్ ట్యాంకర్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న పొలంలో బోల్తా కొట్టింది. దీంతో ట్యాంకర్ డ్రైవర్ శివ కేబిన్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, కొత్తగూడెం ఫైర్ రెస్క్యూ సిబ్బంది సుమారు రెండు గంటలపాటు శ్రమించి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాళ్లు విరిగాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో కొత్తగూడెం ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జూలూరుపాడు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య, కానిస్టేబుల్ సురేష్, రామకృష్ణ, కొత్తగూడెం ఫైర్ రెస్క్యూ టీమ్ లీడర్ సూర్యారావు, సిబ్బంది పుల్లారావు, హరీష్, కార్తీక్, ప్రశాంత్, స్థానికులు పాల్గొన్నారు. ప్రమాద సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

అగ్గికి మొక్కలు బుగ్గి



కాలిపోయిన మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ములకలపల్లి: హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. మండల పరిధిలోని తాళ్లపాయి గ్రామ పంచాయతీ పరిధి ములకలపల్లి శివారు నుంచి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. సుమారు నాలుగేళ్లుగా సంరక్షిస్తున్నారు. సమీపంలోని ఓ రైతు ల్యాండ్ డెవలప్‌మెంట్ చేస్తూ భూమిలోని చెట్లను తొలగించారు. ఈ క్రమంలో వాటికి నిప్పు అంటించగా మంటలు వ్యాపించి హరితహారం మొక్కలు కూడా దగ్ధమయ్యాయి. ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ లక్ష్మయ్య, ఈజీఎస్ ఏపీఓ హుస్సేన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి 21 మొక్కలు దగ్ధమైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఉన్నతాధికారుకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

గంజాయి సీజ్

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. కూనవరం రోడ్డులో ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు, హైదరాబాద్‌కు చెందిన అరవింద్, వేణులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

చర్ల: దుమ్ముగూడెం మండలంలో నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీషా కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం చిననల్లబల్లి శివారులో తాలిపేరు కాలువ కట్ట వద్ద అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఆటోను ఆపి తనిఖీ చేయగా 20 లీటర్ల నాటుసారా లభించింది. సారాతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ ఆలీమ్, కానిస్టేబుళ్లు బాబు, వీరబాబు, రాకేష్, లలితకుమారి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు లీటర్ల సారా స్వాధీనం

టేకులపల్లి: ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం గురువారం మండలంలోని వాగొడ్డు తండా, కొత్తతండా, పాతతండా, బి కాలనీ, చంద్రుతండా, శంభునిగూడెం గ్రామాల్లో దాడులు నిర్వహించింది. ఆరు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుంది. ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు. ఈ దాడుల్లో రామకృష్ణ గౌడ్, గురవయ్య, వెంకటనారాయణ, సుమంత్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి

దమ్మపేట: మండల కేంద్రంలో అక్రమంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై అశ్వారావుపేట ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడి చేశారు. అశ్వారావుపేట ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరరావు కథనం ప్రకారం... దమ్మపేటలో అనుమతులు లేకుండా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి మూడు బెల్ట్ షాపులపై దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 47 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ముగ్గురు బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

న్యూమోనియాతో చిన్నారి మృతి



రుషిక (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో న్యూమోనియాతో ఆరు నెలల చిన్నారి రుషిక గురువారం మృతి చెందింది. ఉదయం 7గంటల వరకు కుటుంబ సభ్యులతో ఆడుకున్న చిన్నారి ఒక్కసారిగా శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతూ ఆయాసానికి గురైంది. దీంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు ఇల్లెందు పట్టణంలోని చిన్నపిల్లల ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. సమస్య ఉత్పన్నమైన గంట వ్యవధిలోనే చిన్నారి తమకు దూరమైందని తల్లిదండ్రులు రామన నరేష్, నిర్మల, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆరు పశువులు పట్టివేత

ఇల్లెందు: కొత్తగూడెం నుంచి ఇల్లెందు మీదుగా మహబూబ్‌నగర్‌కు ఆరు పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఇల్లెందు పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఐ బి.సూర్య ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు గుర్తించి వాహనాన్ని సీజ్ చేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఎన్ శ్రీనివాస్, నరేందర్‌లపై కేసు నమోదు చేసి, పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు.